జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ
డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
వీక్షించండి
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.
ఎడిటర్: చౌదరి, 9963063761

సోమవారం | 21-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 788 పేజీలు: 4 వెల : రూ.7



## వైసీపీ మున్సిపల్ చైర్మన్ రేసులో..
# ఆ నలుగురు!







- ✳ త్రీ మెన్ కమిటీలో ఎంపిక
- ✳ స్పష్టం చేసిన ధర్మాన
- ✳ కొందరు తీరుపై ఆగ్రహం
- ✳ తోక జాడిస్తే కట్ చేస్తానని హెచ్చరిక
- ✳ అటువంటి నాయకులను నిలదీయాలని కార్యకర్తలకు పిలుపు
- ✳ ముందేచెప్పిన 'జాతీయ వార్త' కథనం

**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 20 (వార్త):** ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్మన్ టిక్కెట్ వ్యవహారం కొలిక్కి వచ్చినట్లయ్యింది. సాక్షాత్ మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఈ వ్యవహారానికి పులిస్టాప్ పెట్టారు. మున్సిపల్ చైర్మన్ రైసులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి నలుగురే రేసులో ఉన్నారని, వీరిలో త్రీమెన్ కమిటీ ద్వారా ఎవరో ఒకరికి టికెట్ వస్తుందని స్పష్టం చేశారు. దీంతో ఎవరి ప్రయత్నాలు వారు ముమ్మురం చేస్తున్నారు. ఇటీవల సోంపేటలో జరిగిన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో కొంతమంది నాయకులు వ్యవహార శైలిని దుయ్యబడుతూ ఘాటుగా హెచ్చరికలు జారీ చేశారు. మున్సిపాలిటీ విషయానికి వస్తే సిట్టింగ్ మాజీ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఉలాల కోదండరాం, సిట్టింగ్ మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ జిల్లా వైఎస్ఆర్సిపి మహిళా విభాగం అధ్యక్షురాలు ఉలాల భారతీ దివ్య, సీనియర్ వైఎస్ఆర్సిపి నాయకులు, స్వర్ణభారతి విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీ దాస్ రెడ్డి పేర్లు తమ వద్ద పరిశీలనలో ఉన్నాయని త్రీమెన్ కమిటీ ద్వారా వీరిలో ఎవరో ఒకరికి టికెట్ వస్తుందని ఎవరికి ఎంపిక చేసి టికెట్ ఇచ్చిన అందరూ కలిసికట్టుగా పనిచేసి గెలిపించి తీసుకురావాలని హుకుం జారీ చేశారు. పార్టీ కోసం ఎవరు కష్టపడుతున్నారో ఎవరు తోక జాడిస్తున్నారో తమ వద్ద అందరి చిట్టాలు ఉన్నాయని గట్టిగానే ధర్మాన హెచ్చరించారు. రాత్రిపూట ఒక పార్టీతో పగటిపూట ఇంకో పార్టీతో చేతులు కలిపే నాయకుల జాతకాలు తమ వద్ద ఉన్నాయన్నారు. త్వరలోనే అందరి గుట్లు విప్పుతామని, పార్టీకి నష్టం చేసే వారిని కార్యకర్తలే నిలదీయాలని బహిరంగంగానే చెబుతూ కార్యకర్తల చేతికి బెత్తం ఇచ్చారు. పిలక రాజ్యలక్ష్మి కుటుంబం ఇప్పటికే నాలుగు సార్లు చైర్‌పర్సన్‌గా పని చేశారని చెప్పారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్, సీనియర్ వైఎస్ఆర్సిపి నాయకులు ఉలాల బాలయ్య ఇంటి నుండి కొడుకు, కోడలు ఇద్దరు ఆశిస్తున్నారని వీరిలో ఎవరో ఒకరు టికెట్ కోసం తేల్చుకొని ముందుకు రావాలని చెప్పారు. ఇక చాట్ల తులసీదాస్ రెడ్డి విద్యాసంస్థల పరంగా సేవలు అందిస్తున్నారని చెప్పారు. డాక్టర్ ఉలాల కోదండరాం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో వైద్యునిగా పనిచేసి సూపరింటెండెంట్‌గా కూడా సేవలందించి మంచి పేరు సంపాదించుకున్నారు. అలాగు కేజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసి ఉత్తరాంధ్ర జిల్లాలోనే మంచి పేరు సాధించుకున్నారు. స్థానిక మహాలక్ష్మి నర్సింగ్ హోమ్‌లో రోగులకు సేవలందిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నారు. వాస్తవానికి కోదండరాం పేరు ఎమ్మెల్యే టికెట్ రేసులో వినిపించేది. ప్రత్యక్ష ఎన్నికలు ఉన్నప్పుడు నేరుగా చైర్మన్ అయితే ప్రజలకు మరింత సేవ చేయవచ్చునని ఆలోచనతో పెద్దలను కలిసి తన అభిప్రాయాన్ని చెప్పడంతో తన పేరు పరిశీలనకు వెళ్ళింది. ఉలాల భారతి దివ్య వైస్ చైర్పర్సన్ గా తనదైన శైలిలో మున్సిపల్ సమస్యలపై గట్టిగా ప్రశ్నించేవారు. మున్సిపాలిటీ కీలక సమస్యలైన కుక్కలు, కోతులు, పశువుల బెడద, గోతులు గురించి పదేపదే అధికారులను నిలదీసేవారు. పరిష్కారం దిశగా ప్రయత్నాలు చేసేవారు. అలాగే విద్యా, వైద్య స్థానిక సమస్యలపైన నిత్యం పోరాటం చేసేవారు. తన భర్త డాక్టర్ ఉలాల శేషు యాదవ్‌కు తోడుగా ఉంటూ ద్వారక హాస్పిటల్ నిర్మాణం, మహిరా డయాగ్నస్టిక్ సెంటర్, విశాఖ డయాగ్నస్టిక్ సెంటర్ వ్యవహారాలను చూసుకుంటూ అటు కుటుంబ బాధ్యతను ఇటు వ్యాపార బాధ్యతలను చూస్తూ రాజకీయంగా కూడా రాణిస్తున్నారు. జిల్లా వైఎస్ఆర్సిపి మహిళా విభాగం అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టాక ఆమె స్వరం మరింత పెంచారు. అధికార పక్షంపై పోరాట ధోరణితో నిత్యం ప్రజల పక్షాన నిలుస్తూ తన వాణిని వినిపించి జిల్లా పెద్దల తలలో నాలుకల మెలిగే వారు. ఇక చాట్ల తులసీ దాస్ రెడ్డి విద్యాసంస్థల పరంగానే కాకుండా ప్రజాసేవలో ఒక అడుగు ముందుకు ఉండేవారు. ఎంతోమందికి ఉపాధినిస్తూ పేదలకు ఉచిత విద్య ఫీజులో రాయితీ ఇస్తూ గత మూడు దశాబ్దాలుగా ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థానాల్లో తీర్చిదిద్దారు. మూడు దశాబ్దాలకు పైగా విద్యాసంస్థలపరంగా మున్సిపాలిటీ, మండలంలో ఎక్కడో ఓచోట తన విద్యార్థులు ఉంటారు. తాను కూడా చైర్మన్ రేస్‌లో ఉన్నారు. గతంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్ పర్సన్ గా తన భార్య చాట్ల సుజాత పనిచేశారు. కాంగ్రెస్ హవా లో సైతం తన ఇంటి నుండి కౌన్సిలర్‌గా గెలుపొందారు. దాసును తొక్కేయాలని ఎంతమంది ప్రయత్నిస్తున్న తొక్కేకొద్దీ ఎక్కే నైజం దాసుది. ఇక దాస్ కూడా చైర్ పర్సన్ టికెట్ ఇస్తే గెలిచిన తర్వాత పారదర్శక పాలన, అవినీతి రహిత పాలన అందిస్తానని చెబుతున్నారు. ఇక మాజీ మంత్రి ధర్మాన వద్ద ఉన్న ఆ చిట్టా ఏమిటి? ఆ జాతకాలు ఎప్పుడు బయటపడుతుందో ఏమిటో వేచి చూద్దాం.




## సురక్షితంగా.. స్వస్థలాలకు రప్పిస్తాం..
# ఆందోళన వద్దు

- ✳ మలేషియా అధికారులతో మాట్లాడుతున్నాం
- ✳ కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు
- ✳ మలేషియాలో చిక్కుకున్న సిక్కోలు యువకుల కుటుంబాలకు కేంద్ర మంత్రి భరోసా



**శ్రీకాకుళం, సెప్టెంబర్ 20 (వార్త):** మలేషియాలో చిక్కుకున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన నలుగురు యువకుల కుటుంబ సభ్యులు ఆదివారం శ్రీకాకుళంలోని క్యాంప్ కార్యాలయంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిశారు. తమ కుటుంబ సభ్యుల పరిస్థితిని మంత్రికి వివరించి, వారిని సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సోంపేట మండలం ఎర్ర ముక్కాం గ్రామానికి చెందిన చీకటి సాయి వంశీ, సిరిమామిడి గ్రామానికి చెందిన గిరిబాబు, వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన చొక్కర సాయి, లండ తరుణ్ కుమార్‌లు చిక్కుకున్నారు. ఈ మేరకు వారి తల్లిదండ్రులు పాపారావు, పోతయ్య, మధుర లక్ష్మి, లండ ఈశ్వరరావు, విజయలక్ష్మి లు కేంద్ర మంత్రిని కలసి టూరిస్ట్ వీసాతో వెళ్లి మలేషియా పోలీసులకు చిక్కుకున్న తమవారిని క్షేమంగా తీసుకురావాలని కోరారు. ఇందులో మధ్యవర్తుల ఇబ్బందులు కూడా ఉన్నాయని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు కేంద్ర మంత్రి ధైర్యం చెప్పారు. యువకులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడానికి తాను పూర్తి బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. మలేషియా అధికారులతో పాటు భారత ఎంబసీ, విదేశాంగ శాఖతో నిరంతరం సమన్వయం చేస్తున్నామని తెలిపారు. సోమవారం నాటికి తాజా పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని, అప్పటి వరకు కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని రామ్మోహన్ నాయుడు భరోసా కల్పించారు. యువకులను వీలైనంత త్వరగా క్షేమంగా స్వస్థలాలకు తీసుకురావడానికి అన్ని విధాలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కేంద్ర మంత్రిని కలసిన వారిలో మత్స్యకార నాయకులు సూరాడ చంద్రమోహన్, అశోక్, రాజు, దుర్గారావు, అఖిల్ తదితరులు ఉన్నారు.





# జిల్లాకు వాయుగుండం ముప్పు

- ✳ 21 నుంచి 23 వరకూ వర్షాలు కురిసే అవకాశం
- ✳ తీరం వెంట ఈదురుగాలులు
- ✳ మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దు
- ✳ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి
- ✳ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 20(వార్త):** తీవ్ర వాయుగుండం ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారి ఈనెల 23, 24 తేదీలలో తుఫాన్‌గా మారి శ్రీకాకుళం వైపునకు వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. దీని ప్రభావంతో ఈనెల 21 నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షాలు ప్రారంభమై, 22, 23 తేదీలలో అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. తీరం వెంట గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున మత్స్యకారులు ఈనెల 25 వరకు సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని కీలక ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లో 24 గంటలూ పనిచేసే విపత్తు నిర్వహణకు కంట్రోల్ రూమ్ (ఫోన్: 08942 240557) అందుబాటులోకి తెచ్చామని, 11 కోస్తా మండలాలకు సీనియర్ అధికారులను ఇన్‌ఛార్జిలుగా నియమించామని పేర్కొన్నారు. జిల్లాలోని అధికారులందరికీ సెలవులు రద్దు చేశామని, సోమవారం రాత్రి నుంచి నైట్ డ్యూటీలు అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. జలాశయాలు, నదుల నీటిమట్టం పెరుగుతున్నందున నదీ పరివాహక ప్రాంత ప్రజలు సురక్షితంగా ఉండాలని, రాబోయే నాలుగు రోజుల పాటు ఇసుక రీచ్‌లలో తవ్వకాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. తుఫాన్ పునరావాస కేంద్రాలు లేని ప్రాంతాల్లోని పాఠశాలలను కేంద్రాలుగా మార్చి మంచినీరు, బియ్యం, ప్రాథమిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. మట్టి ఇళ్లలో ఉండేవారు ముందస్తుగా పునరావాస కేంద్రాలకు లేదా బంధువుల ఇళ్లకు వెళ్లిపోవాలని, అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకూడదని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా, మున్సిపల్ కమిషనర్ శ్రవణ్ కుమార్ ఉన్నారు.

జాతీయ

వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# పలాస-కాశీబుగ్గ చైర్మన్ రేసులో కోన కృష్ణారావు

### * పదవి కోసం కాదు.. సుపరిపాలన కోసమేనంటున్న జనసేన సీనియర్ నేత

**పలాస, సెప్టెంబరు 20 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో చైర్మన్ అభ్యర్థిత్వాలపై రాజకీయ వర్గాల్లో చర్చ వేడెక్కుతోంది. వివిధ పార్టీల నుంచి పలువురి పేర్లు వినిపిస్తున్న నేపథ్యంలో జనసేన పార్టీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కోన కృష్ణారావు పేరు కూడా తెరపైకి వచ్చింది. కూటమి పార్టీల్లో ఆయన అభ్యర్థిత్వంపై పరిశీలన జరుగుతున్నట్లు ఆయన వర్గాలు చెబుతున్నాయి.

### పోలీస్ ఉద్యోగం నుంచి రాజకీయాల్లోకి..

కోన కృష్ణారావు పోలీస్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ అనంతరం 2018 నుంచి జనసేన రాజకీయాల్లో చురుకుగా ఉన్నట్లు ఆయన అనుచరులు అంటున్నారు. కోవిడ్ సమయంలో వయసును లెక్కచేయకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆసుపత్రి పడకలు, మందులు, నిత్యావసర సరుకులు, తాగునీరు తదితర అవసరాల్లో సహకరించిన అనుభవం తన రాజకీయ ప్రస్థానానికి బలమని ఆయన వర్గాలు చెబుతున్నాయి. పోలీస్ శాఖలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలను వినే అవకాశం లభించిందని, ఇప్పుడు ప్రజాప్రతినిధిగా అవకాశం వస్తే పట్టణ పాలన ద్వారా వాటికి పరిష్కార మార్గాలు చూపాలన్నది ఆలోచనగా ఆయన వెల్లడించారు. మున్సిపాలిటీ అంటే కార్యాలయం కాదు.. ప్రజల ఇంటి ముంగిట పాలనచైర్మన్‌గా అవకాశం లభిస్తే ప్రజలకు అందుబాటులో ఉండే పాలనకు ప్రాధాన్యం ఇస్తానన్న భావనను కోన కృష్ణారావు వ్యక్తం చేశారు. చిన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలు మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నది ఆయన ప్రతిపాదనగా చెబుతున్నారు. వార్డు స్థాయిలో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించే విధానం ఉండాలని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు నాయకుడి వద్దకు రావడం మాత్రమే కాకుండా.. నాయకత్వమే ప్రజల వద్దకు వెళ్లాలన్నది ఆయన ప్రతిపాదనలోని ప్రధాన అంశంగా ఉంది.

### పనుల నాణ్యతకు మూడు దశల్లో పర్యవేక్షణ..



మున్సిపాలిటీలో చేపట్టే రోడ్లు, డ్రైనేజీలు, కాలువలు, ఇతర అభివృద్ధి పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నది ఆయన ఆలోచనగా చెబుతున్నారు. పనులు మంజూరు చేసే దశ, నిర్మాణ సమయంలో పర్యవేక్షణ, పూర్తయిన తర్వాత నాణ్యత పరిశీలన.. ఇలా మూడు దశల్లో తనిఖీ వ్యవస్థ ఉండాలని ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. పని పూర్తయిన వెంటనే ఫొటోలు తీసి బిల్లులు చెల్లించడం కాకుండా.. ఆ పని ఎంతకాలం మన్నికగా ఉందన్నదే నాణ్యతకు కొలమానంగా ఉండాలన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలని లక్ష్యంతో పనిచేయడం జరుగుతుందని చెప్పారు. పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నది కోన కృష్ణారావు ప్రతిపాదనల్లో మరో ప్రధాన అంశం. ప్రతి ఇంటికీ క్రమబద్ధమైన నీటి సరఫరా, పైపులైన్ లీకేజీల నియంత్రణ, నీటి వృథా నివారణ, అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ నీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. పారిశుద్ధ్యంపై సమగ్ర ప్రణాళికచెత్త సేకరణతోనే పారిశుద్ధ్య బాధ్యత పూర్తికాదని, ఇంటింటా చెత్త సేకరణతో పాటు డ్రైనేజీల శుభ్రత, కాలువల నిర్వహణ, దోమల నియంత్రణ, బహిరంగ ప్రదేశాల పరిశుభ్రత, చెత్తను వేరు చేసి నిర్వహించే విధానం వంటి అంశాలను సమగ్ర పారిశుద్ధ్య ప్రణాళికలో చేర్చాలని ఆయన ప్రతిపాదిస్తున్నట్లు ఆయన తెలిపారు.కాశీబుగ్గలో ప్రత్యేక సేవా కేంద్రం ఏర్పాటు చేసి పలాసలోని మున్సిపల్ కార్యాలయానికి ప్రతి చిన్న పనికీ కాశీబుగ్గ నుంచి ప్రజలు వెళ్లాల్సిన పరిస్థితికి ప్రత్యామ్నాయం చూపాలన్న ఆలోచన కూడా ఆయన చెప్పారు. కాశీబుగ్గలో ప్రత్యేక మున్సిపల్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసి, పన్నులు, జనన--మరణ ధ్రువపత్రాలు, భవన అనుమతులు, చిన్నపాటి ఫిర్యాదులు వంటి సేవలను అక్కడే అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.

### పన్నులకు తగ్గట్టుగా కనిపించే అభివృద్ధి..

ప్రజల నుంచి వసూలు చేసే పన్నులకు అనుగుణంగా వారికి కనిపించే అభివృద్ధి ఉండాలన్న అంశాన్ని కూడా ఆయన ప్రస్తావిస్తున్నట్లు వెల్లడించారు. వార్డుల వారీగా అవసరాలను గుర్తించి రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పార్కులు, తాగునీరు, పారిశుద్ధ్యానికి ప్రాధాన్య క్రమం నిర్ణయించాలని తెలిపారు. చెరువులు, కాలువలు.. ప్రజల ఆస్తులుగా పరిరక్షణపట్టణంలోని చెరువులు, కాలువలు, ప్రభుత్వ భూములు, ఇతర ప్రజా ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నది మరో ప్రతిపాదన. ప్రభుత్వ ఆస్తులను ప్రజల ఆస్తులుగా భావించి వాటి సంరక్షణకు కస్టడియన్ తరహా బాధ్యతతో వ్యవహరించాలన్న ఆలోచనను ఆయన వ్యక్తం చేస్తున్నట్లు అనుచరులు చెబుతున్నారు. ఆక్రమణల నియంత్రణ, చెరువులు--కాలువల పరిరక్షణలో చట్టపరమైన విధానాన్ని అనుసరించాలన్నది ఆయన ప్రతిపాదనగా తెలిపారు. యువత, మహిళలకు ప్రాధాన్యంమున్సిపల్ అభివృద్ధిని కేవలం రోడ్లు, డ్రైనేజీలకే పరిమితం చేయకుండా యువతకు క్రీడా మైదానాలు, మహిళలకు సురక్షితమైన ప్రజా ప్రదేశాలు, పార్కులు, వీధి దీపాలు, వృద్ధులకు అనుకూలమైన సౌకర్యాలను పట్టణ ప్రణాళికలో భాగం చేయాలని ఆయన భావిస్తున్నట్లు చెప్పారు. తుది నిర్ణయం కూటమి అధిష్ఠానానిదేనని, చైర్మన్ అభ్యర్థిగా ఎవరి పేరు ఖరారవుతుందన్నది ప్రస్తుతం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. అయితే అభ్యర్థి ఎంపికలో పార్టీ అధిష్ఠాన నిర్ణయం, కూటమి పార్టీల మధ్య అవగాహన, సామాజిక సమీకరణాలు, స్థానిక రాజకీయ పరిస్థితులు కీలకంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో కోన కృష్ణారావు పేరు చర్చకు రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పదవి దక్కుతుందా? లేదా? అన్నది భవిష్యత్తు రాజకీయ పరిణామాలపై ఆధారపడి ఉన్నప్పటికీ.. మున్సిపల్ పాలనపై తాను అనుసరించాలనుకుంటున్న విధానాలను ముందుగానే ప్రజల ముందుంచడం ద్వారా చైర్మన్ అభ్యర్థిత్వ చర్చలో కోన కృష్ణారావు తనదైన ముద్ర వేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.అయితే చివరకు ఎవరు చైర్మన్ అభ్యర్థి అవుతారు? ఎవరి పేరును కూటమి ఖరారు చేస్తుంది. ప్రజల తీర్పు ఎవరికి అనుకూలంగా ఉంటుంది అన్నదే అసలు ప్రశ్న. ఎన్నికల షెడ్యూల్, రిజర్వేషన్, కూటమి సమీకరణాలు స్పష్టతకు వచ్చిన తర్వాతే చైర్మన్ రేసులో ఉన్న పేర్లపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## 42 వేలకు గణనాథుడి లడ్డూ వేలం

**పలాస, సెప్టెంబరు 20 (వార్త):** ఉమారుద్ర నగర్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. గణనాథుడి నిమజ్జనాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించిన లడ్డూ వేలం పాట ఉత్సాహభరితంగా సాగింది. పోటాపోటీగా సాగిన వేలంలో గణనాథుడి ప్రసాద లడ్డూను బొంగి ప్రసాదరావు, సిందిరి తారకేశ్వరరావు దంపతులు సంయుక్తంగా రూ.42,000కు దక్కించుకున్నారు. అనంతరం గణనాథుని నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

## ఎన్నికల సమయంలో వివాదాలకు తావివ్వవద్దు



**మందస, సెప్టెంబరు 20(వార్త):** ప్రతీ ఒక్కరూ సమన్వయంతో వ్యవహరించాలని, ఎన్నికల సమయంలో వివాదాలకు తావివ్వవద్దని కాశీబుగ్గరూరల్ సీఐ ఎం.తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ హితవు పలికారు. మందస మండలంలోని బాలిగాం గ్రామంలో పల్లె నిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు చట్టాలను గౌరవించాలని పిలుపునిచ్చారు. రాబోయే పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలు కాపాడాలని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని సూచించారు. వివాదాలకు దూరంగా ఉండి చట్టాలను గౌరవించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## నారాయణవలస వద్ద రోడ్డు ప్రమాదం

**నరసన్నపేట, సెప్టెంబరు 20 (వార్త):** గాయపడనారాయణవలస సంత సమీపంలో ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడ్డారు. పర్లాకిమిడి సెంచూరియన్ యూనివర్సిటీలో చదువుతున్న తమిళనాడుకు చెందిన విద్యార్థి ఒకరు, జలుమూరు మండలం పెద్దదూగం గ్రామానికి చెందిన సిద్ధి గణేశ్ ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తుండగా నారాయణవలస సంత సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదం ధాటికి ఇద్దరూ రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులకు సహాయం అందించారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని గాయపడిన ఇద్దరినీ నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వారికి చికిత్స అందిస్తున్నారు.

## తిలారు స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలి

**జలుమూరు, సెప్టెంబరు 20 (వార్త):** జలుమూరు మండలం తిలారు రైల్వే స్టేషన్‌లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని ప్రయాణికులు, పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రజలకు ప్రస్తుతం ఉన్న రైలు సౌకర్యాలు పరిమితంగా ఉండటంతో అదనపు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల అవసరమని పేర్కొంటున్నారు. తిలారు స్టేషన్‌లో ప్రస్తుతం మూడు ప్యాసింజర్ రైళ్లతో పాటు ఇంటర్సిటీ, విశాఖ, పూరి-తిరుపతి, బరంపురం ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే ఆగుతున్నాయని ప్రయాణికులు తెలిపారు. ముఖ్యమైన మార్గాల్లో నడిచే మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఇక్కడ హాల్ట్ లేకపోవడంతో ప్రయాణికులు సమీపంలోని ఇతర స్టేషన్లకు వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. ప్రత్యేకంగా ఫలక్నుమా, కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తిలారు స్టేషన్‌లో నిలుపుదల కల్పిస్తే మండలంలోని ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు రైలు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. తిలారు స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ప్రయాణికుల సంఖ్య, స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకుని అదనపు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ మంజూరు చేసే అంశాన్ని పరిశీలించాలని రైల్వే అధికారులను ప్రయాణికులు, గ్రామస్థులు కోరుతున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కోమర్తి చెత్త నుంచి సంపద కేంద్రం తనిఖీ

**నరసన్నపేట, సెప్టెంబరు 20 (వార్త):** గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీవో పి. జగన్మోహన్రావు సూచించారు. నరసన్నపేట మండలం కోమర్తి పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. కేంద్రంలో చెత్త సేకరణ, వేరు చేయడం, తరలింపు తదితర ప్రక్రియలను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో సేకరించే తడి, పొడి చెత్తను విధిగా వేరు చేసి కేంద్రానికి తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. చెత్తను ఒకే చోట కలిపి వేయకుండా ప్రారంభ దశలోనే వేరు చేయడం ద్వారా వ్యర్థాల నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉంటుందని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులు కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు చెత్త నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.



## పూర్వ విద్యార్థుల కలయిక



**సంతబొమ్మాళి, సెప్టెంబరు20 (వార్త):** నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-98 లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఒకప్పుడు ఎక్కడైతే చదువుకున్నారు అదే చోట తిరిగి 28 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం ద్వారా కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. 1998లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులకు నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికైంది. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు వ్యాపారాలు చేస్తున్న 40 మంది ఇక్కడ కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలుకరించుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఆపాత మధురాలు మరిచిపోలేనివని పేర్కొన్నారు. అలాగే కుటుంబ విషయాలు వ్యాపార విషయాలు ఉద్యోగ విషయాలు చర్చించుకున్నారు. దురదృష్టవశాత్తు చిరస్మరణీయులైన స్నేహితులను తలచుకొని వారి ఆత్మ శాంతి కలగాలని మౌనం పాటిం చారు. ఈ ఆత్మీయ సమ్మేళన కోసం గత కొద్ది నెలల ప్రణాళికతో కష్టపడి వాట్సప్ ఫేస్ బుక్ ల ద్వారా స్నేహితుల నెంబర్లను సేకరించి ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేసినట్లుగా వారు తెలిపారు. అనంతరం తమ గురువులు అప్పన్న, హర నాధరావు, రఘునాథరావు, సావిత్రి, గోవిందరావు, సింహాచలం భాస్కర్ రెడ్డి, మురళి రఘురాం భాస్కర్ రెడ్డి, కు తదితరులకు సన్మానం చేశారు. ఈ కార్యక్ర మంలో చక్రవర్తి, నరసింహారెడ్డి, శ్రీధర్, చిక్కాల శ్రీకాంత్, మౌళి, మధు, ఎర్రయ్య, రవి, శ్రీదేవి, నాగరత్నం, ఢిల్లీశ్వరి, బాలామణితో పాటు మొత్తం 40 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి



**మందస, సెప్టెంబరు20(వార్త):** ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పలువురు వక్తలు అన్నారు. మేజరు పంచాయతీ మందస పట్టణంలోని మెయిన్ రోడ్డులోని కొత్త వీధి డివైడర్ వద్ద, ఈ-బైక్ షోరూమ్ ఎదురుగా 'గో గ్రీన్' సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె.జనార్ధనరావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "శాస్త్ర సాంకేతిక రంగాలు ఎంతో పురోగమించి, సమాజం ఆధునికత వైపు పరుగులు తీస్తున్న నేటి పరిస్థితుల్లో కూడా వర్షాభావం వంటి క్షామ పరిస్థితులను ఎదుర్కోవడం అత్యంత విచారకరమన్నారు. సకాలంలో వర్షాలు పడకపోవడం వల్ల వ్యవసాయ రంగమే కాకుండా తాగునీటి వనరులు కూడా మృగ్యమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ సమతుల్యతను కాపాడినప్పుడే వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గి దేశం సస్యశ్యామలమవుతుందని, గ్రామంలోని యువకులు, విద్యార్థులు మొక్కలు నాటి, వాటిని కాపాడుకోవడం ద్వారా ప్రకృతిని రక్షించవచ్చని హితవు పలికారు.ప్రముఖ సమాజ సేవకులు గిన్ని తిరుపతిరెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో కూడా వేసవిని తలపించే ఎండలు కాయడం, క్షామ పరిస్థితులు ఏర్పడటం చాలా తీవ్రమైన సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. ఏఎస్ఐ జనార్ధనరావు శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు పూనుకోవడం అభినందనీయమన్నారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించడం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఎస్ఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధి నరేష్ మాట్లాడుతూ ఈరోజు నాటిన మొక్కల సంరక్షణకు లోహపు గార్డులను అందించిన పట్నాల మోహనాచారి, వడ్డి చంద్రశేఖర్, విశాలప్రతాప్ సింగ్ దేవ్‌లకు అభినందనలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకై సాగుతున్న ఈ కార్యక్రమానికి మందస పట్టణ ప్రముఖులు, యువకులు ఎంతో సహకారం అందిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గౌడ సుప్రియ, బెహరా జాన్సీ, సీర శోక, కుప్పయి వాహిని, పొందర స్వాతి, సీర కావ్య, పొందర ఢిల్లేశ్వరి, పొందర మీనాక్షి, ఉయ్యాక నిరంజన్, ఎస్.రూపచంద్ర, బిడ్డిక గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిట్టి దాతృత్వం

### * 'ఇప్పిలి' సేవలను అభినందిస్తున్న ప్రజలు

**మందస, సెప్టెంబరు 20(వార్త):** ఆయనో స్థితప్రజ్ఞుడు.. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుంటాడు.. సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటారు. అంతేకాదు.. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కూడా భాగస్వాములవుతారు. ఆయనే ఇప్పిలి కేశవరావు. ప్రతీ ఒక్కరూ ముద్దుగా చిట్టి అని పిలుచుకుంటారు. మందస పట్టణంలో కేశవరావు అనగా చిట్టి అంటే తెలియని వారు ఉండరు. ఎన్నో సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు లక్షల రూపాయలను ఉదారతగా అందించారు. ఇప్పిలి కేశవరావు(చిట్టి) వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతునే.. సోషల్ వర్కర్ గా గుర్తింపు పొందారు. మందస పట్టణం అభివృద్ధిలో కూడా భాగస్వాములవుతున్నారు. మందస పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇదే మండలంలోని బుడారిసింగి పంచాయతీలో గల



నర్సింగపురం గ్రామానికి చెందిన సారక శివకుమార్ ఇంటర్ మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. విధి వక్రీకరించడంతో బ్లడ్ క్యాన్సర్ బారిన పడ్డాడు. నిరుపేద, గిరిజన కుటుం బానికి చెందిన శివకుమార్ కు పలువురు దాతలు సాయం అందిస్తున్నారు. శివకుమార్ పరిస్థితి తెలుసుకుని చలించిన చిట్టి రూ.10వేలును సాయంగా అందజేశారు. శివకుమార్ తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పేదలకు కష్టం వస్తే తానున్నానంటూ సాయం చేస్తున్న కేశవరావు (చిట్టి) దాతృత్వానికి మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, మందస పట్టణానికి చెందిన పలువురు నాయకులు, దాతలు, యువకులు అభినందనలు తెలిపారు.

## కంబకాయలో ప్రజాదర్బార్

**నరసన్నపేట, సెప్టెంబర్20 (వార్త):** నరసన్నపేట మండలం కంబకాయ గ్రామంలో ఆదివారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు చెప్పిన సమస్యలను వారు ఓపికగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడారు. అర్జీలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## వృద్ధ దంపతులకు రూ. 10 వేల ఆర్థిక సాయం



**పాతపట్నం, సెప్టెంబర్ 20 (వార్త):** పాతపట్నం మండలానికి చెందిన శిష్టకరణం సామాజిక వర్గ నిరుపేద వయోవృద్ధ దంపతులు శివప్రసాద్, వారి సతీమణి కొంతకాలంగా అనారోగ్యం, తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవు తున్నారు. ఈ విషయాన్ని స్థానిక శిష్టకరణం సంఘ ప్రతినిధుల ద్వారా తెలుసుకున్న అదే సామాజిక వర్గానికి చెందిన ఉరిటి నాగమణి, ఉమామహేశ్వరరావు దంపతులు వెంటనే స్పందించారు. బాధిత వృద్ధ దంపతుల వైద్య, జీవన అవసరాల నిమిత్తం 10 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. తమ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని, కష్టకాలంలో అండగా నిలిచిన ఉరిటి నాగమణి, ఉమామహేశ్వరరావు దంపతులకు వృద్ధ దంపతులతో పాటు స్థానిక శిష్టకరణం సంఘ నాయకులు, ప్రముఖులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## కిల్లమ్మవీధిలో మహాఅన్నదానం



**మందస, సెప్టెంబరు 20(వార్త):** మేజరు పంచాయతీ మందస పట్టణంలోని కిల్లమ్మవీధిలో భక్తి శ్రద్ధలతో వినాయక నవరాత్రులు కొనసాగుతున్నాయి. ఏకదంతాయ పూజా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మహాఅన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. మాజీ సర్పంచ్ దుంకురు తిరుపతిరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రాజాన మహేశ్ అన్నదానంలో భాగస్వాములై, భక్తులకు స్వయంగా వడ్డించారు. కిల్లమ్మవీధిలో ప్రతీ రోజూ పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. పూజా కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా వినాయకుని పూజలు కొనసాగుతున్నాయని ఏకదంతాయ పూజా కమిటీ సభ్యులు ఆర్.తిరుపతిరావు, కొయిల ఈశ్వరరావు, ఎ.చందు, ప్రవీణ్, చింటు తదితరులు తెలిపారు.

## రూ. 30 వేలు పలికిన గణేశ్ లడ్డు

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 20 (వార్త):** బెల్లుపడ గౌరిసివీధిలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన గణేశ్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగాఆదివారం రాత్రి లడ్డూ వేలంపాట జరిగింది. ఈ వేలంపాటలో సాడి దుర్యోధన రెడ్డి 30 వేల రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. భక్తిశ్రద్ధలతో వేలంపాటలో పాల్గొని లడ్డూను పొందిన సాడి దుర్యోధన్ రెడ్డిని నిర్వాహకులు, స్థానికులు అభినందించారు.





## హరిపురంలో భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

**మందస, సెప్టెంబరు 20(వార్త):** మందస మండలంలోని హరిపురంలో గల పాత రోడ్డులో వినాయక నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. ప్రతీ రోజూ పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం కుంకుమ పూజలను భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. పూజా కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా వినాయకుని పూజలు కొనసాగుతున్నాయని పూజా కమిటీ ప్రతినిధులు తెలిపారు.

## వెరికోస్ వెయిన్స్ బాధితులకు ఉచిత వైద్య పరీక్షలు




**పలాస, సెప్టెంబరు 20 (వార్త):** వెరికోస్ వెయిన్స్ సమస్యతో బాధపడుతున్న వారికి పలాస లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. లయన్స్ క్లబ్ ఆఫ్ పలాస కాశీబుగ్గ ఆధ్వర్యంలో అవిస్ హాస్పిటల్స్ సహకారంతో పలాస లయన్స్ క్లబ్ కార్యాలయంలో శిబిరాన్ని నిర్వహించారు. సుమారు వంద మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కాళ్లలో నొప్పి, వాపు, బరువుగా అనిపించడం, మంట, దురద, చర్మం రంగు మారడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని శిబిరంలో పాల్గొన్న వైద్యులు సూచించారు. సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం ద్వారా ఇబ్బందులను తగ్గించుకోవచ్చని తెలిపారు. డాక్టర్ శారదా రాజేష్ దేవరకొండ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన వైద్య సలహాలు, చికిత్సా సూచనలు అందించారు. వెరికోస్ వెయిన్స్‌కు అందుబాటులో ఉన్న ఆధునిక చికిత్సా విధానాలపై అవగాహన కల్పించారు. అవిస్ క్లబ్ ఆఫ్ పలాస కాశీబుగ్గ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ సహకారంతో శిబిరాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పలాస కాశీబుగ్గ అధ్యక్షుడు ఎన్. కోదండరామయ్య మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా ప్రజలకు ఉపయోగపడే వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇటువంటి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యదర్శి టి. మాధవరావు, కోశాధికారి ఎన్. అప్పారావు ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాట్లు చేశారు. ఈ వైద్య శిబిరంలో హెచ్.వై. దొర, ముదుసూదనరావు, పైల జవహర్, బమ్మిడి నాగేశ్వరరావు, ఎం. లక్ష్మీనారాయణ, డోకి రామారావు, టి.వై. రెడ్డి, పి. రామన్న, వెంకటరావు, గున్న మధు, తాలగాన కిషోర్‌కుమార్, తెప్పల కృష్ణమూర్తి పాల్గొని సేవలందించారు.

## ఉపాధ్యాయుడికి రాష్ట్రస్థాయి అవార్డు




**సంతబొమ్మాళి, సెప్టెంబరు20 (వార్త):** మండలంలోని చిన్నమర్రిపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వి. సీతం నాయుడుకు ప్రతిష్టాత్మక 'గురుబ్రహ్మ రాష్ట్రస్థాయి అవార్డు' లభించింది. విశాఖపట్నానికి చెందిన మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ అవార్డును అందించారు.విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు వినూత్న బోధనా పద్ధతులు అమలు చేయడంతో పాటు, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఉపాధ్యాయులకు శిక్షణలు అందిస్తున్నందుకు ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం, అభ్యసన స్థాయి పెంపు, నాయకత్వ శిక్షణ తదితర కార్యక్రమాల్లో ఆయన సేవలందిస్తున్నారు.డిజిటల్ కంటెంట్, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ విద్యార్థులలో అభ్యసన ఆసక్తిని పెంచేందుకు కృషి చేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. అవార్డు లభించడంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సీతం నాయుడు మాట్లాడుతూ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, విద్యార్థులు, పాఠశాల అభివృద్ధికి మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

## ఇన్‌లైన్ హాకీ క్రీడలో భారత జట్టుకు ఎంపికైన వర్షిత




**మెళియాపుట్టి సెప్టెంబరు20 (వార్త):** ఇటీవల చండీగఢ్ లో జరిగిన ఇన్‌లైన్ హాకీ జూనియర్ బాలికల విభాగంలో భారతజట్టు తరఫున క్రీడా పోటీలో తన కుమార్తె కాల వర్షిత ఎంపికైందని తండ్రి కాళ్ళ ప్రసాద్ తెలియజేశారు. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి గ్రామానికి చెందిన కాల వర్షిత జూనియర్ బాలికల విభాగంలో ఇన్‌లైన్ హాకీ క్రీడలో ఆడేందుకు భారత జట్టుకు ఎంపికైనట్లు 2026 అక్టోబర్ 2వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పరాగ్వే దేశంలోని అసున్సియోన్, సౌత్ అమెరికాలో నిర్వహించనున్న వరల్డ్ ఎస్కేట్ గేమ్స్ 2026 పోటీలలో భారత జట్టు తరఫున జూనియర్ బాలికల ఇన్‌లైన్ హాకీ విభాగంలో కాల వర్షిత ఆడనున్నారని తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే దేశం తరఫున హాకీ క్రీడలో ఆడేందుకు వర్షిత ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, తాతయ్య కాల రామారావు (సాయిరామ్), కుటుంబ సభ్యులు, క్రీడాభిమానులు, యువత, గ్రామస్తులు, ప్రతి ఒక్కరూ వర్షితను అభినందిస్తూ భవిష్యత్ కాలంలో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించి పది మందికి ఆదర్శం కావాలని ఆకాంక్షిస్తున్నారు.

## తోటి విద్యార్థికి ఆర్థిక చేయూత

**సారవకోట, సెప్టెంబరు20(వార్త):** సారవకోట మండలం కుమ్మరిగుంట గ్రామానికి చెందిన యారబాటి రామలక్ష్మికి ఆమెతో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల ఆమె భర్త మృతి చెందడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న తోటి విద్యా ర్థులు ఆమెకు అండగా నిలిచారు. సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రామలక్ష్మి పరిస్థితిని తెలుసుకుని పరస్పరం సహకరించి రూ.43 వేల మొత్తాన్ని సమకూర్చారు. ఆదివారం ఈ ఆర్థిక సహాయాన్ని ఆమెకు అందజేశారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# భైభై..గణేశా!



* కొత్తరోడ్డు వేంకటేశ్వర కాలనీలో గణనాథుని నిమజ్జనోత్సవం * రెండువేల మందికి అన్న ప్రసాదం పంపిణీ * ఉత్సాహంగా వినాయకుని ఊరేగింపు * ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

శ్రీకాకుళం, సెప్టెంబర్ 20 (వార్త): కొత్తరోడ్డులోని వేంకటేశ్వర కాలనీలో గణనాథుని నిమజ్జనోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం సుమారు రెండు వేల మందికి అన్న ప్రసాదాన్ని నిర్వాహకులు పంపిణీ చేశారు. సాయంత్రం గణనాథుని నిమజ్జనోత్సవం నిర్వహించారు. స్వామి వారిని కాలనీ అంతా ఊరేగించారు. ఊరేగింపులో తప్పెటగుళ్లు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం నాగావళి నదిలో స్వామి వారిని నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మూల రాము, సనపల రుషి, రవికుమార్ పాణిగ్రాహి, సురేష్ పండా, ననపల రాము, చింతాడ అప్పలనాయుడు, పైడి గోవింద, సనపల రాజు, రామకృష్ణ, సాయిరాం, సనపల రాజశేఖర్, శ్రీనివాసరావు, అప్పలనాయుడు, తాండ్ర వెంకటరావుతో పాటు కమిటీ కుర్రోళ్లు, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



















Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546